క్లుప్తంగా

కుష్టువ్యాధిని నిర్మూలిద్దాం



మాట్లాడుతున్న మునిసుబ్బారెడ్డి

నగరి :కుష్టువ్యాధిని సమూలంగా నిర్మూలిద్దామని డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ మునిసుబ్బారెడ్డి అన్నారు. కుష్టువ్యాధి నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక ఎస్‌జీఎస్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యాధి చిహ్నాలు, చికిత్సను తెలియజేశారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. హెచ్‌ఎం నమశ్శివాయం, మెడికల్ ఆఫీసర్ సుబ్రమణ్యం, ఆరోగ్యకేంద్ర పర్యవేక్షకురాలు హుసేనమ్మ, ఏఎన్‌ఎం ప్రమీల, ఆశా కార్యకర్తలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకురాలు మృతి



వసంత(ఫైల్)

నింద్ర: నింద్ర పంచాయతీ వైఎస్సార్ సీపీ నాయకురాలు వసంత(40) శనివారం మృతి చెందారు. మూడు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి తిరుపతిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతదేహాన్ని సందర్శించి ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభ, సర్పంచ్ బాబురెడ్డి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం కార్యదర్శి శ్యామ్‌లాల్, జిల్లా మహిళా కార్యదర్శి మేరీ తదితరులు నివాళులర్పించారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పాలసముద్రం : జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన నిర్మించుకోవాలని ఎంపీడీఓ ఎస్.విద్యావతి తెలిపారు. శనివారం పాలసముద్రం దళితవాడ కాలనీలో మంజూరై ఇల్లు నిర్మించుకోని లబ్ధిదారులను కలిశారు. లబ్ధిదారులకు ప్రభుత్వం సకాలంలో బిల్లులు, తక్కువ ధరకు సిమెంట్, ఉచితంగా ఇసుక ఇస్తున్నా నిర్మాణాలు ఎందుకు ఆలస్యం చేస్తున్నారని అడిగారు. ఇల్లు నిర్మించుకోకుంటే పట్టా రద్దు అవుతుందని తెలిపారు. హౌసింగ్ ఏఈ మధు, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాబు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ యశ్వత్ పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో మామూలు స్థితి



కార్వేటినగరం: ప్రత్యేక అవసరాల పిల్లలకు క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ చేయిస్తే మామూలు స్థితికి వస్తారని జిల్లా సహిత విద్య సమన్వయ కర్త ప్రభాకర్‌వర్మ తెలిపారు. శనివారం స్థానిక సంపత్ వీధిలో ఎం.భవిష్య అనే ప్రత్యేక అవసరాల కలిగిన బాలికకు ఇంటి వద్దే సహిత ఉపాధ్యాయురాలు సింధూజ నిర్వహిస్తున్న ఫిజియోథెరఫీని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యేక అవసరాల విద్యార్థుల కోసం ఇంటి వద్ద ఫిజియోథెరఫీ సేవలను అందిస్తోందని తెలిపారు. దివ్యాంగుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకారం



బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకట్రాయులు

నగరి : విజయపురం తహసీల్దార్‌గా వెంకట్రాయులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. పుంగనూరు నుంచి ఆయన ఇక్కడికి బదిలీ అయ్యారు. ఇన్‌చార్జిగా ఉన్న నింద్ర తహసీల్దార్ బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటు ఉంటూ రెవెన్యూ సమస్యలను ఆలస్యం లేకుండా పరిష్కరిస్తానని తెలిపారు.

నేడు అర్ధగిరి క్షేత్రంలో పౌర్ణమి వేడుకలు

తవణంపల్లె: అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో ఆదివారం పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పైమాఘం సురేంద్రరెడ్డి, ఆలయ ఈఓ వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలకు సుదర్శనహోమం భక్తిప్రపత్తులతో నిర్వహిస్తామన్నారు. రాత్రి 8 గంటలకు స్వామి వారి ప్రాకారోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

జగనన్నకు జనం బ్రహ్మరథం

- ప్రతి ఇంటికీ రూ. లక్ష నుంచి రూ.6 లక్షల వరకు లబ్ధి
- ఎక్కడికి వెళ్లినా జగనన్నే ఎప్పటికీ సీఎంగా ఉండాలంటున్న జనం
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి



దాసరిపల్లె : గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పెనుమూరు(కార్వేటినగరం) : రాష్ట్రంలో చారిత్రాత్మక సంక్షేమాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణ స్వామి అన్నారు. శనివారం మండలంలోని దాసరి పల్లె, చార్వగానిపల్లె, అగ్రహారం, చార్వగానిపల్లె దళితవాడ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమాలు అందుతున్నాయ లేదా అని ఆరా తీశారు. దాసరిపల్లెలో లబ్ధిదారు రాజేంద్రమ్మ మాట్లాడుతూ పెద్ద కొడుకులా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పథకాలతో ఆదుకుంటాన్నాడని ఆనందం వ్యక్తం చేసింది. చంద్రబాబు పాలనలో వర్షాలు లేక కరువుతో జనం తల్లడిల్లిపోయారని, పశువులకు కూడా తాగునీరు, గ్రాసం కరువైందని, నేడు జగన్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని, సకాలంలో వర్షాలు కురిసి రైతన్నల ముఖంలో చిరునవ్వు కనిపిస్తోందని చెప్పడంతో మంత్రి ఆనందంలో మునిగి పోయారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ గ్రామాల్లో ఏ గడపకు వెళ్లినా కుల మతాలకు అతీతంగా జగనన్న సువర్ణ పాలనే ఎప్పటికీ ఉండాలని ప్రజలు ఆశీర్వదిస్తున్నారని తెలిపారు. నవరత్న పథకాలు ప్రజలకు జీవనాడిగా ఉందని, దేశానికే ఆదర్శంగా జగనన్న పథకాలు నిలుస్తున్నాయని పేర్కొన్నారు. వివిధ పథకాలతో ప్రతి కుటుంబం రూ.లక్ష నుంచి 6 లక్షల లబ్ధి పొందిందని తెలిపారు. పేద విద్యార్థులకు విదేశ విద్యను చేరువ చేయడానికి విదేశీ విద్యాదీవెనను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపేందుకే అమ్మ ఒడి, విద్యాదీవెన, జగన్న గోరుముద్ద, నాడు–నేడు కింద పాఠశాలల ఆధునికీకరణ, ఆంగ్ల మాధ్యమాన్ని జగనన్న తీసుకు వచ్చారని తెలిపారు. ఒకటో తేదీనే వలంటీర్లు తలుపుతట్టి అవ్వాతాతలకు పింఛన్లు అందజేస్తున్నారని పేర్కొన్నారు, దాసరిపల్లె గ్రామానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ వచ్చిన తరువాత రూ.78 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపడితే అడ్డుకున్న ఘనత టీడీపీ నాయకులదేనని మంత్రి అసహనం వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీని ప్రజలు భూస్థాపితం చేయడం ఖాయమన్నారు. చార్వకానిపల్లె దళితవాడలో డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు యశోదారెడ్డి, జిల్లా కార్యదర్శి దూది మోహన్, యువత ప్రధాన కార్యదర్శి విజయ కుమార్‌రెడ్డి, రాజారెడ్డి, రామకృష్ణారెడ్డి, మురళి, జయచంద్రారెడ్డి, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిలో కూలీల సంఖ్య పెంచాలి



సిబ్బందితో సమీక్షిస్తున్న డ్వామా పీడీ గంగాభవాని

నింద్ర: కూలీల సంఖ్య పెంచి నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోకుంటే చర్యలు తప్పవని ఉపాధి సిబ్బందిని డ్వామా పీడీ గంగాభవాని హెచ్చరించారు. శనివారం సాయంత్రం నింద్ర క్లస్టర్ కార్యాలయంలో 6 మండలాల ఉపాధి హామీ ఏపీఓలు, జేఈలు, సాంకేతిక, క్షేత్ర సహాయకులతో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఉపాధి పనులు చేపట్టి ఎక్కువ మంది పనుల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తద్వారా గ్రామీణ పేద ప్రజలకు ఉపాధి కల్పించినట్లు అవుతుందన్నారు. అలాగే ఉపాధి పథకం కింద నాటిన మొక్కలను బతికించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కూలీలకు డీబీటీ ద్వారా వేతనాలు చెల్లింపులకు ఆధార్ సీడింగ్ అథంటికేషన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. క్లస్టర్ పరిధిలోని నింద్ర, నగరి, విజయపురం, ఎస్సార్‌పురం, కార్వేటినగరం, వెదురుకుప్పం మండలాల ఉపాధి హామీ ఏపీఓ, జేఈ, సాంకేతిక, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంను విమర్శించే అర్హత లేదు

శ్రీరంగరాజపురం: జిల్లా అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని విమర్శించే అర్హత లోకేష్‌కు లేదని డీసీసీ బ్యాంకు డైరెక్టర్ బాలసుబ్రమణ్యంరెడ్డి ఘాటుగా విమర్శించారు. శనివారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వలాభం కోసం పాడి రైతులకు అక్షయ పాత్ర లాంటి విజయ డెయిరీని, షుగర్ ఫ్యాక్టరీని మూయించింది మీ తండ్రి చంద్రబాబు కాదా..? అన్నారు. నారాయణస్వామి, పెద్దిరెడ్డిపై విమర్శలు మానుకోకుంటే గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో చేపట్టే పాదయాత్రను అడ్డుకుంటామని హెచ్చరించారు. చిత్తూరు జిల్లాలో సారా, ఎర్రచందనం స్మగ్లింగ్, బెల్టుషాపులను ప్రోత్సాహించింది ఎవరో ప్రజలకు తెలుసన్నారు. వడ్డెర సంఘం డైరెక్టర్ మనోహర్, అంబేడ్కర్ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి దాము, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దాల శ్మశాన సమస్య పరిష్కారం



స్థలం వద్ద బోర్డు నాటిస్తున్న అధికారులు, సర్పంచ్

నింద్ర: మండలంలోని శ్రీరామాపురం పంచాయతీలో శనివారం శ్మశాన వాటిక ఏర్పాటు చేశారు. దశాబ్దాలుగా శ్మశానం లేకపోవడంతో గ్రామానికి పక్కన ఉన్న అరుణానదీ తీరంలో మృతదేహాలను ఖననం చేసేవారు. నదికి నీటి ప్రవాహం వచ్చిన సమయంలో ఖననం చేసిన మృత దేహాలు బయటకు తేలి కొట్టుకు పోయేవి. సమస్యపై సర్పంచ్ బయమ్మ స్పందించి రెవెన్యూ అధికారులతో చర్చించారు. దళితవాడకు దూరంగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని సర్వే చేయించి అధికారులు శనివారం శ్మశాన వాటికకు కేటాయించారు. ఈ మేరకు హద్దులు నిర్ణయించి బోర్డు సైతం ఏర్పాటు చేశారు.

చక్రత్తాళ్వార్‌కు విశేష పూజలు



హారతి ఇస్తున్న అర్చకులు

గంగాధరనెల్లూరు: వేపంజేరిలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయ దశావతార పుష్కరిణి ఆవరణలోని శ్రీసుదర్శన చక్రత్తాళ్వార్, శ్రీయోగనరసింహస్వామి ఆలయాల్లో మాఘ మాసం పుష్యమి నక్షత్రం సందర్భంగా శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాది పూజల అనంతరం ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేశారు. ఆలయ మేనేజర్ వెంకటేష్‌రెడ్డి ఏర్పాట్లు చేపట్టారు. తీర్థప్రసాదాల వినియోగం జరిగింది.

పట్టుదలతో ఉన్నత స్థానాలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

నగరి : లక్ష్యాలను నిర్దేశించుకుని పట్టుదలతో చదివితే ఉన్నతస్థానాలకు చేరుకోవచ్చని నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.వేణుగోపాల్ అన్నారు. శనివారం కళాశాలలో కెరియర్ గైడెన్స్ సెల్, జేకేసీ ఆధ్వర్యంలో ఫైనల్ ఇయర్ విద్యార్థులకు డిగ్రీ తర్వాత ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో కాలానుగుణంగా సామర్థ్యాలను పెంపొందించుకుంటే ఉద్యోగ అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయని తెలిపారు. రిసోర్స్ పర్సన్ ఎం.యగ్నేస్ మాట్లాడుతూ డిగ్రీ తర్వాత ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగ అవకాశాలను వివరించారు. ఏ ఉద్యోగానికి ఏ విధంగా చదవాలి, సిలబస్, ప్రిపరేషన్ విధానం, మెలకువలు తెలియజేశారు. అధ్యాపకులు డాక్టర్ ఎం పంకజ, డాక్టర్ ఎం భాస్కర్ రాజు, పి నాగార్జున, లాల్ బాషా పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ కుంభాభిషేకం

నగరి : విజయపురం మిట్టూరులో నూతనంగా నిర్మించిన శ్రీకనకదుర్గ ఆలయ కుంభాషేకం వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. గోపూజ, దుర్గాసప్తసతి, హవనహోమం, యాగపూజ, దీపారాధన, అమ్మవారి ఉత్సవ మూర్తుల అభిషేకం, లలితార్చన, కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. పూజల్లో మంత్రి ఆర్కే రోజా సోదరుడు కుమారస్వామిరెడ్డి పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు స్వాగతం పలికి సన్మానించారు.

చెస్ టోర్నమెంట్ పోస్టర్ల విడుదల

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలో ఈ నెల 12న నిర్వహించే ఏపీ ఓపెన్ రాపిడ్ చెస్ టోర్నమెంట్ పోటీల పోస్టర్లను చెస్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం విడుదల చేశారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎస్‌ఆర్‌బీ ప్రసాద్ మాట్లాడుతూ ఈ పోటీల్లో విద్యార్థులు, పెద్దలు పాల్గొనవచ్చని తెలిపారు. విజేతలకు రూ.62,600 నగదు బహుమతి, ట్రోఫీలు, మెడల్స్, సర్టిఫికెట్స్ ఇవ్వనున్నట్లు చెప్పారు. వివరాలకు 9949515058ను సంప్రదించాలని ఆయన కోరారు.

18న మహా శివరాత్రి ఉత్సవం

వెదురుకుప్పం: మండలంలోని తిరుమలయ్య పల్లెలోని శ్రీఆవుదేవర నందీశ్వరస్వామి ఆలయంలో ఈనెల 18న మహా శివరాత్రి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా శివపార్వతులు కల్యాణం, ద్రౌపదీ మానసంరక్షణ వీధి నాటక ప్రదర్శన, భక్తి సంగీత విభావరి తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. పెద్ద ఎత్తున అన్నదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

అవగాహనతో క్యాన్సర్‌కు చెక్



జీడీనెల్లూరు : వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ



శ్రీరంగరాజపురం: కొత్తపల్లిమిట్టలో ర్యాలీ

గంగాధరనెల్లూరు: అవగాహనతో క్యాన్సర్‌కు చెక్ పెట్టవచ్చని తూగుండ్రం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రశాంత్ తెలిపారు. ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా అంబోదరపల్లె, ఎల్లాపల్లెలో వైద్య సిబ్బంది శనివారం అవగాహన కల్పించారు. వైద్యాధికారి మాట్లాడుతూ ప్రాథమిక దశలో క్యాన్సర్‌ను గుర్తిస్తే పూర్తిగా నయం అవుతుందన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని తెలిపారు. అనారోగ్యానికి గురై మూడు వారాల కన్నా తగ్గకుండా ఉంటే వైద్యులను సంప్రదించాలన్నారు. తాజా కూరగాయలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలని, ప్రతి రోజూ వ్యాయామం అవసరమని సూచించారు. చక్కెరశాతం ఎక్కువగా ఉన్న పదార్థాలను పూర్తిగా తగ్గించాలన్నారు. ఆరోగ్యవిద్యాధికారి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ క్యాన్సర్ నియంత్రణ, నివారణపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందన్నారు. క్యాన్సర్‌ను నోటిఫైడ్ జాబితాలో చేర్చిందని తెలిపారు. అనంతరం తూగుండ్రం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

తొలిదశలో గుర్తిస్తే నివారణ

శ్రీరంగరాజపురం: క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తించి చికిత్స తీసుకుంటే ప్రాణాపాయం ఉండదని వైద్యాధికారి డాక్టర్ గౌరీ అన్నారు. శనివారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆరిమాకుల పల్లె ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో కొత్తపల్లెమిట్ట ప్రధాన కూడలిలో మానహారం, ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ అలసట, ఆకలి, మూత్రంలో రక్తం, రొమ్ము లేదా శరీరంలోని ఇతర భాగాలు గట్టి పడడం వంటి లక్షణాలు ఉన్నవారు పీహెచ్‌లో పరీక్షలు చేసుకోవాలన్నారు. మహిళలకు రొమ్ము, గర్భసంచి క్యాన్సర్‌పై అవగాహన అవసరమని చెప్పారు. ధూమపానం, మద్యపానం వల్ల క్యాన్సర్ వస్తుందని తెలిపారు. కొత్తపల్లి వైఎస్సార్ క్లీనిక్ సిబ్బంది, సీహెచ్‌వో కవిత, పర్యవేక్షకురాలు జాన్సీరాణి, ఏఎన్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుష్ప్రచారాన్ని తిప్పికొడదాం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆర్కేరోజా

- అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- గృహసారథులు, కన్వీనర్ల సమావేశంలో మంత్రి ఆర్కేరోజా



హాజరైన గ్రామసారథులు, వలంటీర్లు

నగరి : వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాల ద్వారా అందించిన లబ్ధిని, చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాలు, యువజన సర్వీసులు, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా పిలుపునిచ్చారు. నగరిలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో శనివారం పుత్తూరు మున్సిపాలిటీకి చెందిన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల రూపంలో మూడున్నర ఏళ్లలో లక్షా తొంభై వేల కోట్ల రూపాయలను మహిళల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమచేశారని వివరించారు. ఒక్క రూపాయి కూడా అవినీతికి ఆస్కారం లేకుండా అర్హులకే పథకాలను వర్తింపజేస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ జగనన్న పాలనపై సంతృప్తిగా ఉన్నారని, 2024లోనూ వైఎస్సార్‌సీపీ తప్పకుండా అధికారంలోకి వస్తుందన్నారు. కన్వీనర్లు, గృహసారథులు తమకు కేటాయించిన పరిధిలో ఇంటింటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వం అందిస్తున్న 'నా నమ్మకం నువ్వే జగన్' సామగ్రిని అందించి, సంక్షేమాలను వివరించాలని తెలిపారు. ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం కన్వీనర్లు, గృహసారథులకు 'నా నమ్మకం నువ్వే జగన్' కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, వైస్‌చైర్మన్లు శంకర్, జయప్రకాష్, మున్సిపల్ సచివాలయ కన్వీనర్ ఏకాంబరం, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మాహీన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గ్రామసారథులు పాల్గొన్నారు.

వైద్య ఉద్యోగుల యూనియన్ నూతన కమిటీ



మాట్లాడుతున్న గిరిబాబు

నగరి: నగరి ఏరియా హాస్పిటల్ యూనియన్ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కోశాధికారి అరుణ్ కుమార్ అధ్యక్షతన స్థానిక ఏరియా ఆస్పత్రిలో జరిగిన అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, నర్సుల విస్తృత స్థాయి సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షురాలిగా రత్నమ్మ, అధ్యక్షురాలిగా పుష్ప, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నీరజ, ఉపాధ్యక్షులుగా మధుబాల, ఆదిలక్ష్మి, సంగీత, ప్రధాన కార్యదర్శిగా హేమంత్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా పాండురంగయ్య, సహాయ కార్యదర్శులుగా ధనలక్ష్మి, ఆముద, సుభాషిణి, కుప్పుస్వామి, కోశాధికారిగా బిందును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

అంతకు ముందు జరిగిన సమావేశంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి గిరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి గిరిబాబు కోరారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్‌కు ఉద్యోగ భద్రత కల్పించి, పెండింగ్ డీఏలు ఇవ్వాలని కోరారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలన్నారు.ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కోదండయ్య, కార్యదర్శి రాధా, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

చిరు ధాన్యాల సాగుతో అధిక ఆదాయం



సూచనలిస్తున్న నాగపద్మని

పాలసముద్రం : చిరుధాన్యాల సాగుతో అధిక ఆదాయం వస్తుందని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకురాలు నాగపద్మని తెలిపారు. శనివారం ఐకేపీ కార్యాలయంలో ఏఓ ఢిల్లీప్రసాద్, ఐకేపీ ఏపీఎం ఫరీద్‌మస్తాన్ ఆధ్వర్యంలో జీ–20కి సంబంధించిన ప్రధాన్యతాంశాలపై మహిళలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జొన్న, కందులు, రాగులు, మొక్కజొన్న తదితర పంటలను సేంద్రియ విధానంలో సాగు చేస్తే అధిక దిగుబడి వస్తుందని, మంచి ఆదాయం పొందవచ్చని పేర్కొన్నారు. చిరుధాన్యాల్లో పోషకాలు ఎక్కువగా ఉంటాయని, మార్కెట్‌లో వీటికి మంచి డిమాండ్ ఉంటుందని వివరించారు. చిరుధాన్యాల సాగు సస్యరక్షణ చర్యలను వివరించారు. ఏపీసీఎన్ ఎఫ్ సిబ్బంది, రైతు భరోసా కేంద్ర సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

మల్బరీ సాగుపై అవగాహన



మల్బరీసాగును పరిశీలిస్తున్న అధికారులు

పాలసముద్రం : మల్బరీ సాగులో అధిక ఆదాయాన్ని పొందవచ్చని సెరికల్చర్ ఏడీఎస్ జీ. బాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం వెంకటాచలం తెలిపారు. శనివారం బాలకృష్ణాపురం, తిరుమలరాజుపురం గ్రామ సచివాలయాల ఆవరణలో రైతులకు మల్బరీ సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బాలకృష్ణాపురం, తిరుమలరాజుపురంలో 10 ఎకరాల్లో మల్బరీ సాగులో ఉందని తెలిపారు. రైతులు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నాణ్యమైన పట్టుగూళ్ల ఉత్పత్తికి అనుసరించాల్సిన పద్ధతులను వివరించారు. అలాగే మామిడి, నిమ్మ తరహాలో తక్కువ నీటితో బంజరు భూముల్లో సైతం వృక్ష పద్ధతిలో మల్బరీ సాగు విధానాన్ని వివరించారు. అనంతరం క్షేత్ర స్థాయిల్లో మల్బరీ సాగును పరిశీలించారు. రైతు భరోసా కేంద్రం వీఎస్ఓ రాజేష్, రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తైపూస పూజలు



పాలబిందెలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

చిత్తూరు రూరల్: నగరంలోని శ్రీవల్లి దేవయాని సమేత శ్రీసుబ్రమణ్యస్వామి ఆలయంలో శనివారం తైపూస పూజలను కాలభైరవ ట్రస్టు ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నగరంలో పాలబిందెలతో ఊరేగింపుగా భక్తులు ఆలయానికి చేరుకున్నారు. అనంతరం మూలస్థానంలోని స్వామి వారికి అభిషేకం చేయించారు. ట్రస్టు చైర్మన్ వెంకటేశన్ కంకణాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.